క్లుప్తంగా

ఓటర్ల సర్వే పరిశీలన



సామర్లకోటలో ఓటర్ల జాబితాపై ఇంటింటి పరిశీలన చేస్తున్న ఆర్డీఓ సీతారామారావు

సామర్లకోట: ఓటర్ల జాబితాలపై ఆరోపణలు రావడంతో ఆర్డీఓ, నియోజకవర్గ ఎన్నికల అధికారి జె.సీతారామారావు ఓటర్ల వద్దకు వెళ్లి వివరాలు సేకరించారు. శుక్రవారం మున్సిపల్ కమిషనర్ జె.రామారావుతో కలసి మున్సిపాలిటీ పరిధిలో పలు ఇళ్లలోని ఓటర్లను కలుసుకుని వివరాలు తెలుసుకున్నారు. ఇటీవల సర్వేలో జాబితాలో తొలగించిన ఓట్లు సరైన వేనా, లోపాలున్నాయా అనే కోణంలో పరిశీలిస్తున్నట్టు ఈఆర్ఓ తెలిపారు. ఓటర్లపై సర్వేపై తమ తమ అభిప్రాయా లను తెలియజేయవచ్చున్నారు. సూపర్‌వైజరు ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ నాగవల్లి

పిఠాపురం: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పిఠాపురం ఎక్సైజ్ సీఐ నాగవల్లి సూచించారు. పిఠాపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం నషాముక్త భారత్ అభియాన్‌లో భాగంగా విద్యార్థులకు మాదక ద్రవ్యాల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. డ్రగ్స్ వలన కలిగే అనర్థాలను విద్యార్థులకు వివరించారు. నేషనల్ యాక్షన్ ప్లాన్ ఫర్ డ్రగ్ డిమాండ్ రిడక్షన్ ప్రోగ్రాంలో భాగంగా కళాశాలల విద్యార్థులకు మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల వల్ల కలిగే నష్టాలను వివరిస్తున్నట్లు విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు బి.రామ్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ పి.సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

వర్షంతో సేదతీరిన ప్రజలు

సామర్లకోట: వారం రోజులుగా వేసవి కాలం మళ్లీ వచ్చిందా అన్నట్లు ఉన్న వాతావరణం చల్లబడింది. శుక్రవారం మధ్యాహ్నం సుమారు 30 నిమిషాల పాటు కుండపోతగా వర్షం కురిసింది. దాంతో ప్రజలు ఊరట చెందారు. వర్షానికి రోడ్లపై నీరు చేరింది. వరి చేలకు, దుంప తోటలకు ఈ వర్షం మేలు చేస్తుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

10న వేద సభ

సామర్లకోట: ఈనెల పదో తేదీన కుమారారామ భీమేశ్వరస్వామి ఆలయంలో 25వ వేద సభ నిర్వహించనున్నట్లు ఈఓ డి.నాగమల్లేశ్వరరావు తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ బాలత్రిపుర సుందరి వేద పరిషత్ ఆధ్వర్యంలో వేద సభ జరుగుతుందన్నారు. వేద స్వస్తి నిర్వహిస్తారని తెలిపారు. వేద పండితులను పరిషత్ ఆధ్వర్యంలో సత్కరించనున్నారు.

సారాతో టీడీపీ నేత అరెస్టు

పిఠాపురం: సారా తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను శుక్రవారం రాత్రి పిఠాపురం- విరవాడ జంక్షన్‌లో అరెస్టు చేసినట్లు పిఠాపురం రూరల్ పోలీసులు తెలిపారు. టాటాఏస్ వాహనంపై సారా తరలిస్తున్నట్లు వచ్చిన ముందస్తు సమాచారం మేరకు పిఠాపురం రూరల్ ఎస్సై గుణశేఖర్ తన సిబ్బందితో పిఠాపురం-విరవాడ జంక్షన్‌లో వాహనాల తనిఖీ నిర్వహించారు. టాటాఏస్ వాహనంలో సారా తరలిస్తున్న గొల్లప్రోలు మండలం చెందుర్తికి చెందిన మోర్తా బాబ్జి, అరుగుల తాతీలు (టీడీపీ నేత) వజ్రకూటానికి చెందిన పిల్లా కార్తీక్‌లను అరెస్టు చేశారు. వారి నుంచి 50 లీటర్ల సారా, టాటా ఏస్ వాహనం స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యార్థులకు ఉపాధి నైపుణ్య శిక్షణ



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సునీత

ఏలేశ్వరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల కేంద్రంగా ఉన్నతి ఫౌండేషన్, ఇన్ఫోసిస్ సౌజన్యంతో విద్యార్థులకు ఉపాధి నైపుణ్య శిక్షణ ఇస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డి. సునీత తెలిపారు. కళాశాలలో మొదటి బ్యాచ్‌లో 30 రోజుల శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు శుక్రవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ బెంగళూరు ఉన్నతి ఫౌండేషన్‌లో శిక్షణ పొందిన కె.శ్రీదేవి విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఇకపై ప్రతి 30 రోజులకు ఒక బ్యాచ్ చొప్పున విద్యార్థులకు శిక్షణ ఇస్తామన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ప్రగడ ప్రయాగమూర్తి, కె.వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

అమ్మ చేతి ముద్దంత రుచి

- మధ్యాహ్న భోజనంగా జగనన్న గోరుముద్ద
- పాఠశాలల్లో ఇష్టంగా తింటున్న విద్యార్థులు
- అదనంగా రాగిజావ, ప్రత్యామ్నాయంగా పులిహోర
- హాజరు, విద్యా ప్రమాణాల పెంపే లక్ష్యంగా ప్రభుత్వ చర్యలు సఫలీకృతం



జె.తిమ్మాపురం పాఠశాలలో భోజనం చేస్తున్న విద్యార్థులు



కట్టమూరు పాఠశాలలో రాగి జావ తాగుతున్న విద్యార్థులు

పెద్దాపురం: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం పోషకాలతో కూడిన మధ్యాహ్న భోజనం అందిస్తోంది. విద్యార్థులు చదువులో చక్కగా రాణించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం రోజుకో మెనూతో జగనన్న గోరుముద్ద పథకాన్ని అమలు చేస్తోంది. రుచికరమైన ఆహారంతో పాటు రాగిజావ కూడా అందిస్తుంది. దీంతో విద్యార్థులు మధ్యాహ్న భోజనాన్ని ఇష్టంగా ఆరగిస్తున్నారు.

నియోజకవర్గంలో ఇలా..

నియోజకవర్గంలో మొత్తం 153 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలున్నాయి. సుమారు 12,529 మంది విద్యార్థులు భోజనం చేస్తున్నారు. గతంలో నాసిరకమైన వంటకాలతో అరకొరగా మధ్యాహ్న భోజన పథకం నడిచేది. ఆ భోజనాన్ని తినేందుకు విద్యార్థులు కూడా అంతగా ఆసక్తి చూపేవారు కాదు. ఇప్పుడు పరిస్థితులు మారాయి. విద్యార్థుల అభిరుచికి అనుగుణంగా మెనూలో ప్రభుత్వం మార్పులు తీసుకువచ్చింది. ఎప్పటికప్పుడు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, విద్యా కమిటీ అభిప్రాయాలను సేకరిస్తోంది. కొన్ని గ్రామాల విద్యార్థులు సాంబార్ అన్నాన్ని ఇష్టంగా తినకపోవడంతో నిమ్మకాయ పులిహోర పెడుతున్నారు. పాఠశాలల్లో ఉపాధ్యాయుడు ఆహారాన్ని పరిశీలించిన తరువాతే విద్యార్థులకు పెట్టడం విశేషం. గతంలో వంట ఏజెన్సీల నిర్వాహకులు నెలకు మూడుసార్లు కోడిగుడ్లు సరఫరా చేసేవారు. కొన్ని కుళ్లిపోయి విద్యార్థులు తినలేకపోయేవారు. దీనిని గమనించిన ప్రభుత్వం నెలకు నాలుగు సార్లు గుడ్లు సరఫరా చేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఏ వారంలో సరఫరా చేసిన గుడ్లను ఆ వారమే వాడేలా వేస్తున్నారు. దీంతో భోజనం చేసే విద్యార్థుల సంఖ్య పెరుగుతోందని ఉపాధ్యాయులు, విద్యాకమిటీ చైర్మన్లు చెబుతున్నారు.

మెనూ వివరాలిలా..

సోమవారం: పొంగలి, ఉడికించిన గుడ్లు, కూరగాయల పలావ్, గుడ్డుకూర, చిక్కీ
మంగళవారం: పులిహోర, టమాటా పచ్చడి, దొండకాయ పచ్చడి, ఉడికించిన గుడ్లు, రాగిజావ
బుధవారం: వెజిటబుల్ బిర్యాని, ఆలూ కుర్మా, ఉడుకించిన గుడ్లు, చిక్కీ
గురువారం: సాంబార్, ఉడికించిన గుడ్లు,
శుక్రవారం: ఆకుకూర పప్పు, ఉడికించిన గుడ్లు, చిక్కీ
శనివారం: ఆకుకూర సాంబార్, తీపి పొంగలి, రాగిజావ

భోజనం రుచిగా ఉంటుంది



నేను రోజూ పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేస్తాను. రోజుకో రకం భోజనం పెడుతున్నారు. చాలా రుచిగా ఉంటుంది. ఇంట్లో కన్నా పాఠశాలలో భోజనమే చాలా బాగుంది. – కనుజల రాణి, 8వ తరగతి, కట్టమూరు హైస్కూల్

అందరూ తింటున్నాం



గతంలో మధ్యాహ్న భోజనం సరిగ్గా తినేవాళ్లం కాదు. ఇప్పుడు చాలా రుచిగా ఉండడంతో రోజూ తింటున్నాం. రోజుకో టీచర్ వచ్చి భోజనం పరిశీలించాకే మాకు పెడుతున్నారు. – ఎం.ప్రసన్నలక్ష్మి, పదో తరగతి, చంద్రమాంపల్లి హైస్కూల్

రాగిజావను ఇష్టంగా తాగుతున్నాం



భోజనంతో పాటు రాగిజావ ఇస్తున్నారు. గతంలో నేను మధ్యాహ్న భోజనం తినే దాన్ని కాదు. ఇప్పుడు జగనన్న గోరు ముద్ద భోజనాన్ని తింటున్నాను. – కొత్త నందిని, 9వ తరగతి, కొండపల్లి హైస్కూల్

ఇష్టంగా తింటున్నారు



రోజూ మధ్యాహ్న భోజనాన్ని పర్యవేక్షించే బాధ్యతను ఒక్కో టీచర్‌కు అప్పగిస్తున్నాం. ఆ టీచర్ దగ్గరుండి అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు. నాణ్యమైన భోజనాన్ని విద్యార్థులకు అందిస్తున్నాం. అందరూ ఇష్టంగా తింటున్నారు. – ఎం సత్యవాణి, హెచ్ఎం, కట్టమూరు, పెద్దాపురం మండలం

పార్టీ రహితంగా సంక్షేమం అమలు

ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు



ప్రభుత్వ సంక్షేమ పథకాన్ని వివరిస్తున్న హౌసింగ్ చైర్మన్ దొరబాబు

పెద్దాపురం : పార్టీ రహితంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయడం వైఎస్సార్ సీపీకే దక్కుతుందని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు అన్నారు. »గడప గడపకూ మన ప్రభుత్వం«లో భాగంగా శుక్రవారం స్థానిక 1వ సచివాలయం పరిధిలో పాత పెద్దాపురం, సత్తెమ్మతల్లి గుడి వీధి ప్రాంతంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, వైస్ ఎంపీపీ మిరియాల రాజా, ఆ వార్డు కౌన్సిలర్లు ఆకుల కృష్ణబాపూజీ, ఆల్లె వీర్రాఘవులు, విడదానరి రాజా, నాగబోయిన రాజుబాబు, సచివాలయ సిబ్బందితో కలసి పట్టణం గడప గడపనూ సందర్శించారు. సచివాలయ పరిధిలో ప్రజలకు అందుతున్న ప్రజా సంక్షేమ పథకాల అమలుపై గడప గడపకూ వెళ్లి అడిగి తెలుసుకున్నారు. అనంతరం చైర్మన్ దొరబాబు మాట్లాడుతూ ప్రజా సంక్షేమ పాలన సీఎం జగన్‌తోనే సాధ్యమని, పార్టీ రహితంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. కౌన్సిలర్ గోకేడ అప్పారావు, గదపా శివ, లక్కాకుల కృష్ణ, సుందరెడ్డి రాజు, నల్లల గోవిందు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ వర్ధంతి

సామర్లకోట: వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా శనివారం నియోజకవర్గ పరిధిలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు దవులూరి దొరబాబు శుక్రవారం తెలిపారు. ఈ కార్యక్రమాల్లో పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, అభిమానులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలన్నారు.

వనదుర్గ అమ్మవారికి చండీ హోమం

అన్నవరం: రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి శుక్రవారం చండీ హోమం నిర్వహించారు. పండితులు ఉదయం తొమ్మిది గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలు సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. వేద పండితులు హనుమంతువఝల అమరయ్య, ఉపాధ్యాయుల రమేష్, వనదుర్గ ఆలయ అర్చకుడు చిట్టెం వాసు, నగేష్, వ్రతపురోహితులు చెల్లపిల్ల ప్రసాద్, కూచుమంచి ప్రసాద్ తదితరులు హోమం నిర్వహించారు.

అమ్మవార్లకు లక్ష కుంకుమార్చన

సత్యదేవుని ఆలయంలో సత్యదేవుని దేవేరి అనంతలక్ష్మీసత్యవతీదేవి అమ్మవారికి ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలోనూ, కొండదిగువన కనకదుర్గ అమ్మవారికి అర్చకుడు ప్రయాగ రాంబాబు ఆధ్వర్యంలోనూ రుత్విక్కులు లక్ష కుంకుమార్చనలు నిర్వహించారు.



రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి చండీ హోమం నిర్వహిస్తున్న పండితులు

ఠంచన్‌గా పింఛన్



కొమరగిరిలో వృద్ధురాలికి పింఛను అందజేస్తున్న వలంటీర్

కొత్తపల్లి: మండల వ్యాప్తంగా శుక్రవారం సామాజిక పింఛన్ల పంపిణీ జోరుగా జరిగింది. తెల్లవారుజాము నుంచే గ్రామ వలంటీర్లు లబ్ధిదారులు ఇంటికి వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. మండలంలో 12626 మంది పింఛనుదారులు ఉండగా తొలిరోజు 8926 మందికి (70.7 శాతం) పంపిణీ చేసినట్టు ఎంపీడీఓ అబ్రహం లింకన్ తెలిపారు. నూరుశాతం పింఛన్లు పంపిణీ చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. పింఛన్ల పంపిణీలో వలంటీర్లు నిర్లక్ష్యం వహించినా, అవకతవకలకు పాల్పడినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాగా వలంటీర్లు ఇంటికే తెచ్చి పింఛన్లు అందజేయడంపై లబ్ధిదారులు ఆనందాన్ని వ్యక్తం చేశారు.



కొత్త పింఛన్లను అందజేస్తున్న 13 వార్డు కౌన్సిలర్ నేతల హరిబాబు, సచివాలయ కార్యదర్శులు

కొత్త పింఛన్ల పంపిణీ

సామర్లకోట: మున్సిపాలిటీ పరిధిలో కొత్తగా మంజూరైన పింఛన్లను ఆయా వార్డుల కౌన్సిలర్లు శుక్రవారం లబ్ధిదారులకు అందజేశారు. అలాగే మండల పరిధి గ్రామాల్లో లబ్ధిదారులకు ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పింఛన్లు అందజేశారు. మరి కొన్ని కొత్త పింఛన్లు జనవరి నెలలో వస్తాయని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు తెలిపారు.

జీజీహెచ్‌కు వెళ్లి పింఛన్ల అందజేత

సామర్లకోట: అనారోగ్యంతో కొన్ని రోజులుగా కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న ఇద్దరు వృద్ధులకు స్థానిక వలంటీర్లు శుక్రవారం సామాజిక పింఛన్లు అందజేశారు. స్థానిక 15వ సచివాలయానికి చెందిన కొంతేటి జగదీష్, కాదా అనిల్‌లు పేపకాయల లక్ష్మి, మంగం నారాయణమ్మలకు పింఛను సొమ్ము అందజేశారు. తెల్లవారు జామునే లబ్ధిదారులకు వారి ఇళ్లవద్ద పింఛన్లు అందజేసి 85 శాతం పూర్తి చేసినట్టు అధికారులు తెలిపారు.

4న జాబ్ మేళా

తుని రూరల్: వి.కొత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 4న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ లలిత శుక్రవారం తెలిపారు. బిఐఎఫ్ఎల్ సంస్థలో పని చేయుటకు ఇంటర్మీడియెట్, ఆపై చదువుకున్న 18 నుంచి 30 సంవత్సరాల లోపు యువకులు అర్హులన్నారు. తెలుగు, ఇంగ్లిషుపై పట్టు ఉండి ద్విచక్ర వాహనం ఉండాలన్నారు. ఆసక్తి కలిగిన వారు ఆధార్ కార్డు, పాన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, విద్యార్హత సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలను 70139 80150 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

జగనన్న కాలనీకి చేరిన వైఎస్సార్ విగ్రహం



కాలనీలో ఏర్పాటు చేస్తున్న వైఎస్సార్ విగ్రహం

సామర్లకోట: స్థానిక ఈటీసీ లేఅవుట్‌లో జగనన్న కాలనీ ప్రధాన రోడ్డులో వైఎస్సార్ విగ్రహం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ విగ్రహాన్ని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్నారు. ఈ నెల 12న కాలనీని ప్రారంభించడానికి రానున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఈ విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు. హనుమాన్ జంక్షన్ నుంచి 18 అడుగుల ఎత్తైన వైఎస్సార్ విగ్రహాన్ని ప్రత్యేక వాహనంలో శుక్రవారం తీసుకువచ్చారు. హనుమాన్ జంక్షన్‌కు చెందిన ప్రముఖ విగ్రహాల రూపకర్త ప్రసాద్ ఈ విగ్రహాన్ని తయారు చేశారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

కొత్తపల్లి: విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి చెందినట్లు శుక్రవారం స్థానిక పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళితే...పొన్నాడ శివారు కోనపాపపేటకు చెందిన ఉప్పాడ బంగారి (42) స్థానిక ప్రభుత్వ లే అవుట్‌లో ఇల్లు నిర్మించుకున్నాడు. గురువారం రాత్రి మోటారు నుంచి నీరు రాకపోవడంతో మోటారు వద్దకు వెళ్లగా కింద ఉన్న తీగలు కాలికి తగిలి విద్యుత్ షాక్ గురయ్యాడు. చికిత్స నిమిత్తం పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దీనిపై మృతుడి భార్య జగతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై రామలింగేశ్వరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వరాలతల్లికి వందనం



పాదగయ క్షేత్రంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు



పాదగయ క్షేత్రంలో భక్తులకు చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు దంపతులు



భక్తులకు జాకెట్టు ముక్క, గాజులు అందజేస్తున్న హౌసింగ్ చైర్మన్ దొరబాబు

- భక్తిశ్రద్ధలతో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు
- కిటకిటలాడిన పాదగయక్షేత్రం
- భక్తులకు పూజా సామగ్రి అందించిన ఎమ్మెల్యే దొరబాబు

పిఠాపురం: శ్రావణ మాసంలో మూడో శుక్రవారం కావడంతో దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన పిఠాపురం పాదగయ క్షేత్రంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. ఈ వ్రతాలకు 5500 మంది మహిళలు తరలిరావడంతో పాదగయ క్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. ఎమ్మెల్యే పెండెం దొరబాబు తన సొంత ఖర్చులతో భక్తులకు పూజా సామగ్రిని ఏర్పాటు చేయడంతో పాటు ఎమ్మెల్యే దంపతులు భక్తులకు పూజా సామాగ్రి పంపిణీ చేసి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఉదయం నుంచి భక్తులు బారులుతీరడంతో పాదగయ పరిసర ప్రాంతాలు భక్తులతో నిండిపోయాయి. మూడు దఫాలుగా నిర్వహించిన వరలక్ష్మీ వ్రతాల్లో పాల్గొన్న భక్తులకు ఎమ్మెల్యే దొరబాబు ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ ఆగంటి ప్రభాకరరావు, ఈఓలు శ్రీనివాసరావు, ఆర్.సౌజన్య, పలువురు వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

భీమేశ్వర ఆలయంలో సామూహిక వ్రతాలు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా సామూహిక వ్రతాలు జరిగాయి. బాలాత్రిపుర సుందరి సమేత కుమారారామ భీమేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించే వ్రతాలకు ఆలయ అధికారులు, దాతలు పూజ సామగ్రి ఏర్పాటు చేసినట్లు ట్రస్ట్ బోర్డు చైర్మన్ మట్టపల్లి రమేష్‌బాబు తెలిపారు. ఆలయ మొదటి అంతస్తు ప్రాకారం చుట్టూ వ్రతాలు చేసుకునే మహిళలతో నిండిపోయింది. ఈ వ్రతాలను ఈఓ వి.నాగమల్లేశ్వరరావు, ట్రస్ట్ బోర్డు చైర్మన్ మట్టపల్లి రమేష్‌బాబు లక్ష్మీదేవి చిత్ర పటం వద్ద పూజలు చేసి ప్రారంభించారు. ఆలయ అభిషేక పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, కొంతేటి జోగారావు, వినయ్, చెరుకూరి రాంబాబులు పూజలు నిర్వహించారు. సుమారు 550 మంది మహిళలు వ్రతాలు ఆచరించారు. దేవస్థానం ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. భక్తులకు ట్రస్టు బోర్డు సభ్యులు నాతిపాముల సూరిబాబు, యండమూరి వెంకట్రావు, బొందలపు కృష్ణవేణి, చల్లా కుమారి, కర్రి వెంకటలక్ష్మి, భక్త సంఘం నాయకులు అంజనీకుమార్, టీవీ రమణ, చల్లా సత్తిబాబు సేవలందించారు.

ఆలయాలకు పోటెత్తిన భక్తులు

కొత్తపల్లి: శ్రావణమాసంలో మూడో శుక్రవారం కావడంతో ఆలయాలకు భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే గ్రామాల్లోని అమ్మవార్ల ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పండితులు అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అమ్మవార్లను వివిధ రకాల పూలతో సుందరంగా అలంకరించారు. కొత్తపల్లి శ్రీధర్మశాస్తా ఆలయంలోని దుర్గాదేవి, కొత్తదొడ్డిలోని బాలదుర్గ, యండపల్లి, వాకతిప్ప, కుతుకుడుమిల్లి, కొండెవరం, కొత్తపల్లి, ఉప్పాడ, గోర్స, మూలపేట, యండపల్లి గ్రామాల్లోని అమ్మవార్ల ఆలయాల్లో రద్దీ నెలకొంది. పలు ఆలయాల్లో సామూహిక వరలక్ష్మి వ్రతాలు నిర్వహించారు.

వరలక్ష్మీదేవిగా నూకాలమ్మతల్లి

పెద్దాపురం: మండలంలోని కాండ్రకోట నూకాలమ్మ తల్లి శుక్రవారం వరలక్ష్మీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ఈఓ టీవీ సూర్యనారాయణ ఆధ్వర్యంలో పండితులు వరలక్ష్మీ వ్రతాన్ని వైభవంగా నిర్వహించారు. ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు, జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, ఈఓ, ఆలయ చైర్మన్ గవరసాని రామస్వామి భక్తులకు అమ్మవారి రూపు, జాకెట్ ముక్క, పసుపు, కుంకుమ, గాజులు పంపిణీ చేశారు. సుమారు 1550 మంది మహిళలు వ్రతం ఆచరించగా ఉప సర్పంచ్ జోశా నానాజీ, పీఏసీఎస్ అధ్యక్షుడు వల్ల గంగారావు, కమిటీ సభ్యులు లక్కాకుల కృష్ణ, పార్టీ నాయకులు నాగబోయిన రాజుబాబు, గంటా రామస్వామి, గవరసాని రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే కనకదుర్గ, వనదుర్గ ఆలయాల్లో, ఇళ్లలో మహిళలు వరలక్ష్మీ వ్రతాలు ఆచరించారు.

బంగారు, వెండి పుష్పాలతో మరిడమ్మకు పూజలు

పెద్దాపురం: స్థానిక మరిడమ్మ తల్లికి శ్రావణ శుక్రవారం సందర్భంగా బంగారు, వెండి పుష్పాలతో పూజలు చేశారు. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్‌వీ రామ్మోహనరావుల ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషేకాలు, చండీహోమం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



ఆలయంలో సామూహిక వ్రతాల్లో పాల్గొన్న మహిళలు



నూకాలమ్మ ఆలయంలో వరలక్ష్మీ వ్రతం చేస్తున్న మహిళలు



బంగారు, వెండి పుష్పాలతో పూజలు అందుకుంటున్న మరిడమ్మ తల్లి

గడువు తీరిన గ్లూకోజ్ విక్రయంపై కేసు

కాకినాడ రూరల్: నాగమల్లితోట జంక్షన్ వద్ద ఆక్రమ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారంటూ శుక్రవారం పెద్ద ఎత్తున ప్రచారం జరగడంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. గడువు ముగిసిన టాటా గ్లూకోజ్ తాగడంతో సుమారు ఏడుగురు విద్యార్థులు అస్వస్థతకు గురికాగా విషయం గ్రహించిన పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది ఆ గ్లాసులను వెనక్కు తీసేసుకున్నారు. సామాజిక మాధ్యమాల్లో ప్రచారంపై ఎంఈఓ ఎల్.గణేష్‌బాబు, సర్పవరం పోలీసులు, సీడీపీఓ సావిత్రి, అక్కడకు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మరో వైపు పాఠశాల నుంచి అందిన సమాచారం మేరకు అసిస్టెంట్ ఫుడ్ సేఫ్టీ కంట్రోలర్ శ్రీనివాస్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు పాఠశాలకు చేరుకుని గ్లూకోజ్ గ్లాసులను పరిశీలించి ఆగస్టు 26 వరకు కొన్ని, ఆగస్టు 27, 28 తేదీల వరకు బెస్ట్ బిఫోర్ యూజ్‌గా ఉన్నట్టు గుర్తించి సుమారు 50 గ్లూకోజ్ గ్లాసులను స్వాధీనం చేసుకున్నారు. అచ్చంపేట జంక్షన్ వద్ద సత్య ఎంటర్ ప్రైజర్స్ నుంచి వాటిని కొనుగోలు చేసినట్టు ప్రిన్సిపాల్ అగస్టిన్ చెప్పడంతో దుకాణదారుపైనా, పాఠశాలపైనా కేసు నమోదు చేశారు. ఈ విషయాన్ని జేసీ కోర్టులో పెట్టనున్నట్టు వారు తెలిపారు.

వ్యాపారులకు జరిమానా

కాకినాడ సిటీ: జిల్లాలో నాణ్యత లేని ఆహార పదార్థాల తయారీ, ప్యాకింగ్ నియమ, నిబంధనలు పాటించని నలుగురు వ్యాపారులపై పెట్టిన కేసులను విచారించి వారికి జరిమానా విధించినట్లు జేసీ ఇలక్కియ తెలిపారు. దొడ్ల డెయిరీ పెరుగు విక్రయాలకు పాల్పడిన దొడ్ల డెయిరీ లిమిటెడ్, చెందుర్తికి చెందిన శీనప కుమార్‌స్వామికి రూ.లక్ష జరిమానా విధించారు. అలాగే రఘు ప్యాకేజ్ డ్రింకింగ్ వాటర్‌కు సంబంధించి కాకినాడ జగన్నాథపురం విష్ణాలయం వీధికి చెందిన రఘు ఇండస్ట్రీస్ మొల్లేటి శ్రీరమణికి రూ.5 వేలు, క్రీమ్ బన్ విక్రయిస్తున్న గీత్, సంగీత్ కాంప్లెక్, భానుగుడికి చెందిన బాలాజీ ఫుడ్స్, మోరంపూడి రాధాకృష్ణకు రూ.10 వేలు, భానుగుడి యతిఫుడ్స్ క్రీమ్ బన్‌కు సంబంధించి తుతకోట సత్యనారాయణకు రూ.10 వేలు జరిమానా విధించినట్లు జేసీ ఇలక్కియ తెలిపారు. సమావేశంలో జిల్లా ఆహార నియంత్రణ అధికారి బి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.